క్లుప్తంగా

పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం తప్పకుండ అందించాలని ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని కె.సింగవరం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును, రికార్డులను పరిశీలించారు. ఆహార పదార్థాలను పరిశీలించి నాణ్యతగా చేట్టాలని సూచించారు. అదేవిధంగా గ్రామంలోని వీధులలో పర్యటించిన ఆయన వీధుల ఆరోగ్య జాగ్రత్తలపై ప్రజలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సైపుల్లాబేగ్, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: కర్నూలు నగరం బి.క్యాంపు హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలను ఎంఈఓ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అడ్మిషన్ రికార్డులు, రిజిస్టర్లను, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందించే రాగి జావను తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడిన ఎంఈఓ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివపార్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఓర్వకల్లు: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని సోమయాజులపల్లె, కాల్వబుగ్గ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల పరిసరాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని హెచ్‌ఎంలకు సూచించారు. అలాగే ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. మెనూ ప్రకారమే భోజనం వడ్డించాలని, వంట గదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

జీవనోపాధులు మెరుగు పర్చుకోండి

ఓర్వకల్లు: స్వయం సహాయక సంఘాల సభ్యురాళ్లు తమ జీవనోపాధులను మెరుగు పర్చుకోవాలని ఏపీఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన ఓర్వకల్లులోని గ్రామైక్య సంఘాన్ని తనిఖీ చేశారు. సభ్యురాళ్లు తీసుకున్న రుణాలు, చెల్లింపు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ చిరువ్యాపారాలతో జీవనం సాగించే పొదుపు మహిళలు బ్యాంకుల నుంచే గాక, మహిళా సాధికారత కింద వ్యాపారాల మేరకు ముద్ర/ఎంఎస్‌ఎంఈ కింద రూ.1లక్ష నుంచి 5 లక్షల వరకు వ్యక్తిగతంగా రుణాలు పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే వారికి 2 శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లోపు దాదాపు 100 మందికి రుణ సదుపాయం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి సభ్యులు ఆధార్‌కార్డుతో పాటు, పాన్‌కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓర్వకల్లు తహసీల్దార్ బదిలీ

ఓర్వకల్లు: ఆరు మాసాల పాటు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన నటరాజ్ మంగళవారం బదిలీపై వెళ్లారు. గత సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సత్యసాయి జిల్లా నుంచి ఓర్వకల్లుకు బదిలీపై వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి నుంచి బదిలీ ఉత్తర్వులు తీసుకుని వెళ్లినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఇద్దరికి గాయాలు

పాణ్యం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయని ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు. నందికొట్కూరు మల్యాలకు చెందిన భాస్కర్‌నాయుడు, సురేంద్ర ఆచారి బైక్‌పై నంద్యాల నుంచి సిమెంట్ నగర్‌కు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొందన్నారు. వీరిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బోగస్ సర్టిఫికెట్లను ఏరివేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం బోగస్ సర్టిఫికెట్ల ఏరివేతకు చర్యలు తీసుకోవాలని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ట్రిన్స్ కాంట్రాక్టు మల్టీపర్సన్ హెల్త్ అసిస్టెంటు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం లోకాయుక్తలో బోగస్ సర్టిఫికెట్లకు సంబంధించిన కేసు విచారణ జరిగింది. ఈ కేసు విచారణకు ఆయన హాజరయ్యారు. అయితే కేసును సెప్టెంబర్ 2వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు

బొమ్మలసత్రం: రాష్ట్రంలో ప్రస్తుతం టీడీపీ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో వచ్చి 55 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పేదలకు చెప్పిన ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రెండు హత్యలు, నాలుగు దౌర్జన్యాలతో ఆ పార్టీ ముందుకెళ్తోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశంలో పూర్తి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్‌తో సరిపెట్టడం చూస్తే సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడేందుకు అనే అనుమానం కలుగుతుందన్నారు. తమకు ఓటు వేస్తే సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చంద్రబాబు న మ్మించి ప్రజలను మోసం చేశారన్నారు. తల్లికి వందనం పథకం అమలు చేయకుండా విద్యార్థులకు ఎగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. గతంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా అమలయ్యేదని, టీడీపీ ప్రభుత్వం ఇంత వరకూ రైతులకు ఒక్క పైసా లబ్ధి చేకూర్చే పనులు ప్రారంభించలేదన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. టీడీపీ 55 రోజుల పాలనలో 36 హత్యలు, 35 ఆత్మహత్యలు, దాదాపు 550 చోట్ల ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, 490 ప్రభుత్వం ఆస్తుల ధ్వంసం 1000 మందిపై దౌర్జన్యం చోటు చేసుకోగా, 2 వేల కుటుంబాలు వలస వెళ్లాయన్నారు. ఇంత విధ్వంసం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఢిల్లీ సాక్షిగా వైఎస్ జగన్ సాక్షాలతో సహా ఫొటోలతో ప్రదర్శించిన ఇంత వరకూ ఎలాంటి శాంతిభద్రల చర్యలు తీసుకోకపోవటం బాధాకరమన్నారు. సమావేశంలో వైఎస్సార్సీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ శశికళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు... అండగా ఉంటాం

- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని హామీ
- బాధిత కుటుంబానికి రూ.50వేల చెక్కు అందజేత



స్రవంతికి చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, అన్నివిధాలుగా అండగా ఉంటామని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. టీడీపీ నాయకుల అరాచకాలు స్తుతిమించాయని, ప్రజలు అన్నివిషయాలను గమనిస్తున్నారన్నారు. గడివేముల మండలంలోని ఒండుట్ల గ్రామంలో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన రవీంద్రారెడ్డి కుటుంబానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం పంపారు. ఈ మేరకు మంగళవారం కల్లూరులోని కాటసాని స్వగృహంలో రవీంద్రారెడ్డి భార్య స్రవంతికి మాజీ ఎమ్మెల్యే కాటసాని రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఇటువంటి హింసాత్మక ఘటనలకు ఏనాడు పాల్పడలేదన్నారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పంటల పరిశీలన



గొల్లలదొడ్డిలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో సాగైన పంటలను మంగళవారం ఏఓ మల్లేష్‌కుమార్ పరిశీలించారు. పత్తి, వేరుశనగ, కొర్ర, కంది పైరును పరిశీలించిన ఆయన పరిశీలించారు. పత్తి పంటలో రసంపీల్చే పురుగు ఉధృతిని గుర్తించారు. రైతులకు సంరక్షణ సూచనలు చేశారు. లీటరు నీటిలో రెండు గ్రాముల అసిటామాప్రైడ్, అదేవిధంగా ఒక లీటరు నీటికి 2 ఎంఎల్ మోనోక్రోటోఫాస్‌తో పాటు లీటరు నీటికి 2 ఎంఎల్ వేపనూనే కలిపి పంటపై పిచికారీ చేయాలని ఏఓ రైతులకు సూచించారు. అదేవిధంగా ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కౌలుకార్డుతో కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటేష్, వీఏఏ శశికాంత్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య ఎస్.నరసింహులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నరసింహులు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈయన గతంలో 2019 నుంచి 2022 వరకు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే వర్సిటీ ఎకనామిక్స్ విభాగ సమన్వయకర్తగా ఆ విభాగ సహాయాచార్యులు డాక్టర్ ఎస్.శ్రీధర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎకనామిక్స్ విభాగ అధ్యక్షుడిగా పనిచేసిన ఆచార్య ఎన్‌టీకే నాయక్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా నియమితులు కావడంతో డాక్టర్ శ్రీధర్‌ను సమన్వయకర్తగా నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆచార్య నరసింహులుకు వివిధ విభాగాల అధ్యక్షులు, ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

బోధనేతర పనుల నుంచి మినహాయించాలి



ఎంఈఓ సునీలమ్మకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కోడుమూరు రూరల్: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రం గూడూరులో మంగళవారం విద్యారంగ సమస్యలపై ఎంఈఓ సునీలమ్మకు యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జీఓ117ను రద్దు చేయాలని, ప్రీ ప్రైమరీతో పాటు 1నుంచి 5వతరగతులను ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలపి డిమాండ్ చేశారు. స్కూళ్లలో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గూడూరు యుటీఎఫ్ మండల అధ్యక్షుడు కాంతారావు, ట్రెజరర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి సర్వేపై శిక్షణ



సర్వేపై అవగాహన కల్పిస్తున్న మునికన్నన్

కర్నూలు (సెంట్రల్): రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న వీఆర్వోలు, జూనియర్ అసిస్టెంట్లకు సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని ఏడీ మునికన్నన్ ప్రారంభించారు. మంగళవారం బి.తాండ్రపాడు సమీపంలో సర్వేను ప్రారంభించి పలు మెలకువలను వివరించారు. సర్వే ఎలా చేయాలి, విలువలను ఎలా తీసుకోవాలి అనే అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. జిల్లా అధికారి విజయ సారథి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. కళ్యాణదుర్గం మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు (55) వ్యవసాయం చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మనమరాలు కుషి డెంగ్యూ జ్వరంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఆస్పత్రికి వచ్చిన ఆయన ఉదయం మెడికల్ షాపుకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో బి క్యాంపు వైపు నుంచి విజయ్ అనే వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కర్నూలు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

సర్వీసు నుంచి కానిస్టేబుల్ తొలగింపు

కర్నూలు (టౌన్): వీఆర్‌లో (వేకెన్సీ రిజర్వు) పనిచేస్తున్న కానిస్టేబుల్ నరసింహులు విధులకు డుమ్మా కొట్టడంతో పాటు నిర్లక్ష్యం వహిస్తుండటంతో సరీ్వసు నుంచి తొలగిస్తూ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం రాత్రి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సివిల్ సప్లై పథకాలపై అభిప్రాయ సేకరణ

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై సంబంధిత శాఖలు తమ అభిప్రాయాలను 4వ తేదీలోపు తెలపాలని ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్/డీఆర్వో కె.మధుసూదన్‌రావు కోరారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో ర్యాపిడ్ అసిసెస్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్, ఐసీడీఎస్, లీగల్ మెట్రాలజీ, సోషల్ వెల్ఫేర్ శాఖల జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రస్తుతం సివిల్‌సప్లై డిపార్టుమెంట్ ద్వారా ప్రజలకు అందిస్తున్న బియ్యం, బ్యాళ్లు, చక్కెర క్వాలిటీ, క్వాంటిటీతోపాటు వాటిపై ఉన్న సందేహాలు, సలహాలు ఇంటే సూచనలు చేయాలన్నారు. త్వరలోనే డీలర్లు, ప్రజల నుంచి కూడా ఆయా పథకాల అమలుపై అభిప్రాయాలు సేకరించనున్నట్లు డీఎస్ఓ కేవీఎస్ఎం ప్రసాద్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ పరిధిలోని అన్ని వార్డులలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. వారు మంగళవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో షిరిడీ సాయి నగర్, నజీర్ కాలనీ, అయిషా నగర్, రాంనగర్, నాల్గవ తరగతి కాలనీల్లో రూ.2 కోట్లతో అంతర్గత డబ్ల్యూబీఎం రోడ్లు, అలాగే ముజుందర్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి కేసీ కెనాల్ యూటి జొహరాపురం రోడ్డు వరకు మేజర్ డిస్పోజల్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబ్ల్యూబీఎం రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ఎంఈ శేషసాయి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, డీఈఈ రవిప్రకాష్‌నాయుడు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగు సూచనలు పాటించాలి



ఎ.గోకులపాడు గ్రామంలో పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కల్లూరు: రైతులు పంటలలో అధిక దిగుబడులు సాధించాలంటే అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పత్తి శాస్త్రవేత్తలు మంజునాథ్, విష్ణుకుమార్, సుజాత, ఎమ్మిగనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఖాద్రీ, ఏఓ శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం కల్లూరు మండలంలో ఎ.గోకులపాడు గ్రామంలో పత్తి పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి 8 లింగాకర్షణ బుట్టలు, 40 పసుపు పల్లాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేప నూనెను లీటర్ నీటికి 5 ఎం.ఎల్ వేసి మొక్క తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు వరదరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గిడ్డయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి తప్పని ఎదురు చూపులు



ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు సాగునీటికి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ప్రధాన కాల్వల నుంచి 1500 క్యూసెక్కుల వరకు అవుకు రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. రైతులు వాడుకోకుండా అన్ని బ్లాక్‌లను బిగించారు. ప్రతి బ్లాక్ వద్ద లస్కర్లు కాపలా కాస్తున్నారు. దీంతో రైతులు కళ్ల ముందే సాగు నీరు దిగువకు వెళ్తున్నా ఉపయోపడడం లేదని ఆందోళన చెందున్నారు. అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గోరుకల్లు నుంచి పాణ్యం మండలానికి సంబధించి ఏడుబ్లాక్లు ఉన్నాయి. ఈ బ్లాక్‌ల కింద దాదాపుగా 20వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ రైతులు ఎంతో ఆశతో సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు బ్లాక్‌ల నుంచి సాగునీరు దిగువకు వెళ్లకుండా ఎక్కడిక్కడ గెట్లను మూసివేశారు. దీంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని గేట్లు తెరవాలని కోరుతున్నారు. సమస్యను ఈఈ క్రిష్ణన్న దృష్టికి తీసుకెళ్లగా సాగునీరు కావాలని అడగితే విడుదల చేస్తున్నామన్నారు. ప్రధాన కాల్వలో ఏమైనా అడ్డు ఉంటే దిగువకు వెళ్తుందనే ఉద్దేశంతో బ్లాక్‌లను మూసివేశామని, రైతులు కావాలంటే బ్లాక్‌లను తెరుస్తామని చెప్పారు.

హెచ్‌ఎంపై దాడి అమానుషం



హెచ్‌ఎం నారాయణతో మాట్లాడుతున్న ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు

పాణ్యం: బలపనూరు జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న డేగ నారాయణపై విద్యార్థి తండ్రి దాడి అమానుషమని ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఖండించారు. మంగళవారం బలపనూరు పాఠశాల వద్దకు వెళ్లి హెచ్‌ఎం నారాయణను నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న విషయంలో విద్యార్థిని మందలించిన హెచ్‌ఎంపై తండ్రి దాడి చేయండం బాధకరమన్నారు. విద్యాబోధనలు చేస్పే ఉపాధ్యాయులపై దాడులు, దౌర్జన్యాలు చేయడం సిగ్గు చేటన్నారు. అదే పాఠశాలలో చదివే విద్యార్థి తండ్రి హెచ్‌ఎంపై దాడికి తెగబడడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు శివక్రిష్ణయాదవ్, బత్తిన ప్రతాప్, శ్రీరామ్, రాజు, విగ్నేష్, మధుసూధన్, సతీష్ పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు



గోశాలకు పశువులను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరంలో ఎద్దులు, ఆవులు, గేదెలు, శునకాలను రోడ్లపైకి వదిలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక ఆరోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాష ఆదేశాల మేరకు.. నగరంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడపడితే అక్కడ పశువులను వదిలేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, అలాగే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లపైకి పశువులను వదిలిన యజమానులకు జరిమానాలు విధించామన్నారు. ఇదిలాఉండగా గుత్తి పెట్రోల్ బంకు వద్ద పశువుల తరలింపును పలు సంఘాల నాయకులు అడ్డుకుని మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆరోగ్య శాఖ అధికారి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి జబ్బులపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ఉపాధ్యాయులు విద్యార్థుల కంటి జబ్బులపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ సంధ్యారెడ్డి సూచించారు. మంగళవారం కర్నూలు అర్బన్, రూరల్ సైన్స్, పీఈటీ ఉపాధ్యాయులకు స్థానిక ఎంఆర్‌సీ భవనంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని ఎలా గుర్తించాలి అనే దానిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్యారెడ్డి మాట్లాడుతూ.. దృష్టిలోపం, మెల్లకన్ను, కంజెంటివైటిస్, విటమిన్ ఏ లోపంపై శిక్షణలో ఉపాధ్యాయులకు వివరించామన్నారు. దృష్టిలోపం ఉన్న వారిని త్వరగా గుర్తించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దృష్టిలోపం ఉన్న వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తామని చెప్పారు. మండల విద్యాధికారులు విజయకుమారి, ప్రభావతమ్మ, ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ, పి.పరమేశ్వరరెడ్డి, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

వేప ఉత్పత్తులు...పంటలకు మేలు


- ఎరువు తయారీ ఖర్చు తక్కువ
- దాదాపు 300 రకాల కీటకాలను పొగొట్టే గుణం
- పంటలకు ఉపయోగిస్తే అధిక దిగుబడులు



గడివేముల: వేప ఉత్పత్తులు మనుషులతోపాటు సాగుకు ఎంతో మేలు చేస్తుంది. సర్వరోగ నివారని అయిన వేప పంట సాగుకు ఉపయోగకరం. పంటలకు వేప ఉత్పత్తులు వాడితే ఎంతో మేలు చేకూరుతుంది. వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లజాతి పురుగులు, చెదలు, భూమిలోని కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, కూరగాయలు, పండ్ల మొక్కలు, జొన్న ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్లో వేపపిండి, వేపనూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు వేప సంబంధిత ఎరువులను,మందులను ఎక్కువగా వినియోగిస్తారు. నీమ్ ఆయిల్ వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలను నివారించవచ్చు. ఈ మందు పిచికారీ చేసినప్పుడు పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలు ఉండవు. పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనెటీగలు వంటి జీవరాశులకు హాని చేయదు. సమగ్ర సస్యర క్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి.

వేప నూనె పిచికారీతో ప్రయోజనం

పైరును పురుగు ఆశించిన వెంటనే వేప నూనె పిచికారీ చేస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే పిచికారీ చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌కు లీటరు నీటితో కలిపి 20 లీటర్లు పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో (ఉదయం లేదా సాయంత్రం) 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సిందే.



వేప విత్తనాలు

తెగుళ్ల నివారణ

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో వివిధ చీడపీడలను నివారించవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీ లీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తొడిమికుళ్లు, పొడతెగులు, వరితుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిరప పంటపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిరప మీద వచ్చే జెమినీ వైరస్ అదుపులో ఉంటుంది. టమాటా సాగులో ఎండు తెగులును వేప నూనెతో నివారించవచ్చు.

ఇంట్లోనే వేప కషాయం తయారీ:

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేప గింజలు నలగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు. మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి. మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి. పైరుకు పిచకారీ చేస్తే అద్భుత ఫలితాలు ఉంటాయి.

వేప పిండితో మంచి ఫలితాలు



వేప ఉత్పత్తులతో మంచి దిగుబడులు వస్తాయి. నూనె తీయగా వచ్చే వేపచెక్క, ఎండిన వేపకాయలను దంచితే వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి, మిరప పంటలు, నిమ్మ తోటలకు వాడవచ్చు. దిగుబడిలో మంచి ఫలితాలు పొందవచ్చు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే భూమి స్వభావం తగ్గిపోతుంది. ఈ మేరకు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– హేమ సుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల